# మతిమరుపు

సారథికి తగని మతిమరుపు. తన వస్తువైందీ తెలియదు, యితరుల వస్తువైందీ తెలియదు. ఏది వాడుకున్నా, ఎవరిది వాడుకున్నా తిరిగి ఆ వస్తువు అసలు యజమాని దగ్గరకు చేరదు. మరి అది దాని దారి అదే చూసుకుంటుంది. ఒక వేళ చేరినా చాలా రభస జరిగింతరువాత చేర్తుంది. అనేకసార్లు అనేక విషయాల్లో, భార్యను పట్టుకు ఛడామడా తిట్టాడు. తిరిగి తనదే పొరపాటనీ, జ్ఞాపకం లేక పోవడంవల్లనే యిలా జరుగుతోందనీ సర్ది చెప్పేవాడు.

ఒకసారి ఆఫీసులో తను టైపుకొట్టిన కాగితాలు మేనేజరు బల్లమీద పెట్టాడు. మర్నాడు ఆఫీసుకు వచ్చేసరికి మేనేజరు మండిపడుతూ "నీ కేమైనా జ్ఞానంవుందా, యేమిటయ్యా నువ్వు టైపుకొట్టేది? ఏం కాగితాలు నువ్వు టైపుచేసింది? నే నిచ్చిన నోటీసేది?" అని కేకలేసి మొహాన గిరవాటేశాడు. చూసుకుంటే, అవి ఆఫీసు కాగితాలు కావు. ఇంగ్లీషు వారపత్రికకి

శ్రీ ప్రయాగరాజు కృష్ణమోహన్

తను పంపదలచుకున్న పదిపేజీల వ్యాసం అసలు టైపుకొట్టవలసినకాగితాలు పత్రికా సంపాదకునివద్దకు నడిచాయి. "నా వుద్యోగంపోతుంది, నన్ను జైలులో వేస్తారు" అని మొత్తుకుంటూ రెండు వుత్తరాలు రాస్తే సంపాదకునివద్దనుంచి జవాబులేదు. ఎందుకొస్తుంది? అసలా వుత్తరాలు జేరితేగా! పెట్లోనే వుండిపోయాయి. మూడో వుత్తరం పట్టిపట్టిరాసి, స్వయంగా కవరులోపెట్టి అతికించి, స్వహస్తాలతో పోస్టు బాక్సులో పడేశాడు. నాలుగురోజులలో కాగితాలు ఎలాగయితేనేం సక్రమంగా తిరిగొచ్చాయి. దానితోపాటు వొక చిన్న వుత్తరంకూడా వుంది సంపాదకుని దగ్గర నుంచి. అందులో యిలావుంది. "మీరు రాసిన విషయాలన్నీ చదివాను. ఇలాంటి రిజిష్టరు నోటీసుల్ని ప్రచురించటం చాలా అసహ్యంగా వుంటుంది. ఇందులోని విషయాలన్నీ వొక కథానికగా వ్రాసి పంపితే ప్రచురిస్తాం." సారథికి తల తిరిగి పోయింది. 'ఏమిటీ యీ గొడవ' అని కాగితాలు చదివిచూస్తే, అవి ఆఫీసు కాగితాలు కావు. మేనేజరు తన పినతండ్రి కొడుక్కి ఆస్థి విషయమై యిచ్చిన పది పేజీల రిజిస్టరునోటీసు. అంటే 'పర్సనల్ వర్కు' అన్నమాట.

మరోసారి చంటిపిల్లకి వొక చిన్నగౌను కొందామని వొక బట్టలకొట్లో దూరాడు. గౌను ఎగాదిగా చూశాడు. చాలా బాగుంది. రూపాయిన్నర. కొనటానికే గట్టిగా నిశ్చయించాడు. అయినప్పటికీ




అతిత్వరలో దక్షిణదేశమంతటా విడుదల కానున్నది.
చిరకాలముగ ప్రజలెదురుచూచుచున్న ఈ సంవత్సరపు మేటిచిత్రం.

షిన్ షినాకి - బుబ్లాబూ

నేడు బొంబాయిలో 10 థియేటర్లలో క్రిక్కిరిసిన ప్రేక్షకులకు ప్రదర్శింప బడుచున్నది.
అందరు మీ అభిమాన తారలే!
* రంజన్ * రెహానా * సాధనాబోస్ * బేబితబసుమ్ * తివారె * వీరా.
డైరెక్టర్: సంతోషి.
సంగీతము: శ్రీరామచంద్ర.

★

బుకింగుకు ప్రాంతీయహక్కులకు :-
లక్ష్మీ ఫిలిమ్ కంపెనీ,
పోస్టుబాక్సు 25 — బెంగుళూరు-2.



తనకు గుడ్డనాణ్యం బాగా తెలుసనీ, కొట్టువాళ్లు తనని మోసం చేయలేరనీ, యీ విషయమే కొట్లోవాళ్ళు అనుకోవాలనీ, తదనుగుణ్యంగా గౌను యీమూల కాసేపు, ఆమూల కాసేపు నలిపి, గుండీలు విప్పదీసి మళ్లీపెట్టి, యిలా చేయడం మొదలెట్టాడు. ఇంతట్లోకే వెనకాలేవొచ్చి భుజంతట్టి పలకరించాడు మిత్రుడు జయరాం. "ఏరోయి రాముడూ! ఎక్కడా వుండటం, యేం చేస్తున్నావ్?" అని మళ్ళీ తిరిగి సారధి పలకరించి, సంభాషణలో దిగాడు. సంభాషణ చాలా జోరుగా సాగుతోంది. ఇదంతా చూసి యిహ మధ్యలో ఆ బేరగాళ్ళని Disturb చేస్తే గౌరవం పోతుందని భయపడి, ఆ కొట్టుయజమాని యింకెవరో బేరగాళ్ళొస్తే వాళ్ళపని చూడటం మొదలెట్టాడు. జయరాం, సారధీ, అనేక విషయాల్ని గురించి మాట్లాడుకుంటున్నారు. ఇలా మాట్లాడుతూనే సారధి చేతిలోవున్న గౌనుని నలిపి, నలిపి, చివరకు జేబురుమాలు సైజుకి మడతపెట్టాడు. కాస్సేపటికి జయరాం వెళ్ళిపోయాడు. షాపు యజమానివొచ్చి, "యేం బాబూ, గౌను బిల్లురాయమన్నారా?" అని బల్లవంక చూశాడు గౌనుకోసం. ఏదీ గౌను? మాయమైపోయింది. ఇద్దరూ గాభరా పడ్డారు. షాపు యజమాని క్రిందంతా వెతికాడు. ఎక్కడా కనపడలేదు. అనుమానమేసింది సారధిమీద. "ఏమవుతుందయ్యా నీ చేతికిచ్చినగౌను? బట్టలుచూస్తే డాబుసరిగా వున్నాయి. ఆ వచ్చినవాడు, నువ్వు దొంగతనం జాయంటుగా చేశారా? వాడికిచ్చి పంపివుంటావు. పోలీసుకు రిపోర్టు చేస్తా" అని రౌద్రాకారం ప్రదర్శించి, యేదో మామూలుగా సారధి లాల్చీ జేబుమీద దృష్టి సారించాడు. అందులోనించి గౌను కనపడుతోంది. "జేబులో పెట్టావా దొరా, యిదా సంగతి!" అని జేబు పట్టుకోబోయేటప్పటికి సారధి "పళ్ళు రాల్తాయ్! ఇది నా జేబురుమాలు, చూసుకో కావలిస్తే" అని పైకి లాగాడు. ఇంకేముంటుంది! జేబురుమాలతోసహా గౌను కూడా బయటకొచ్చింది సారధి రుమాలనుకుని, సంభాషణ ధోరణిలో పొరపాటుని గౌను జేబులో పెట్టుకున్నానని క్షమార్పణ కోరుకున్నాడు.

మిమ్మల్నికనేను వేధించదలచుకోలేదు. ఆఖరి సంఘటన చెప్తున్నా.

ఆరోజు ఆఫీసుకు శెలవుదినం. ప్రొద్దున ఆరింటికే లేచి ముఖం కడుక్కుని బయలుదేరాడు కాఫీ అయినా త్రాగకుండా. "మా తమ్ముడొచ్చాడు" అని భార్య యింకా యేదో చెప్పబోతూవుంటే, వినిపించుకోకుండా, "అబ్బ! యిప్పుడుకాదు. ఎన్ని వుద్యోగాలిప్పించినా పోగొట్టుకుంటాడు. కూర్చోమను. వస్తా" అని చెప్పి చక్కాబోయాడు; వంకెనున్న బట్టలు తొడుక్కుని. ఇంటికొచ్చేటప్పటికి "మా మంచిగౌరవం చేశాం యింటికొచ్చినందుకు వాడికి." అని గొణగటం మొదలెట్టింది భార్య. "ఏం అవమానం జరిగింది నీ తమ్ముడికి?" "వాడు రాత్రి పన్నెండింటికివచ్చి బనీనుతోసహా బట్టలు వంకెకి తగిలించాడు. డాబామీద వెళ్లి పడుకున్నాడు. తెల్లవారేటప్పటికి బనీను మాయమైంది. మిగతావన్నీ వున్నాయి. క్రొత్తదిగూడాను." అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. "ఆ పనిచేసే దాని పనే యిది"-అని దాన్ని కాసేపు తిట్టాడు, అది ఎదురుగా లేకపోయినప్పటికీ. కోటు, చొక్కా విప్పి భోజనానికి కూర్చున్నాడు. ఇంతట్లో బావమరిది కూడా వచ్చి కూర్చున్నాడు అన్నం తింటున్నారన్న మాటేగాని,

(47-వ పేజీ చూడండి)



# పాలిటెక్నిక్ - మత్స్యశాఖ

(6-వ పేజీ తరువాయి)

ర్థులు. ఖాళీలు లేవు అంది ప్రభుత్వము. విద్యార్థులు నిరాశాపూరితు లయ్యారు.

అసలే, రాష్ట్రప్రభుత్వశాఖలలో జీతాలు చాలా తక్కువ. అసిస్టెంటు యిన స్పెక్టరు ఆఫ్ ఫిషరీస్ - అనే హోదాగల తాలూకా ఆఫీసరుగారికి జీతం రు 60/-; కరువుబత్తెం 24 రూ॥ వెరశి 84/- వస్తుంది దానితో అతని మీద ఆధారపడివున్న సంసారాన్ని లాగాలి. యిప్పుడున్న తాలూకా ఆఫీసర్లలో చాలామంది సాంకేతికంగా ఏ విజ్ఞానము లేనివారే! అయితే వారికి, సాంకేతిక నిపుణులకు ఒకే జీతం అంటుంది ప్రభుత్వము. యీ తేడా లేని జీతాలకు విద్యార్థులు నిరసన జూపారు. తిరిగి ప్రభుత్వంతో సంప్రదింపులు సాగించారు. "మాకు రు 90 జీతంతో ఉద్యోగం మొదలుపెట్టాలి" అన్నారు విద్యార్థులు; "ఆర్థిక యిబ్బందులవల్ల అసంభవము. రు60/- యిస్తామని" అంది ప్రభుత్వం. పైగా చాలామంది "మీరెంత, మీకు డిగ్రీ వుందా? S. S. L. C ప్యాసయిన వాళ్లేగా" అని చిన్నచూపు చూడ్డం జరిగింది. జరుగుతోంది. కాని వాళ్లు చదివిన సాంకేతిక విద్యమాట ఏమిటి? ప్రభుత్వంతో రాయబారాలు నిష్ఫలమయాయి. విద్యార్థులు నీరసించారు. తమ అదృష్టాలనీ చదివిన కోర్సునీ తిట్టుకొన్నారు. వీరిలో చాలామంది తాలుకాఫీసుగుమాస్తాలుగా, రైల్వే గుమాస్తాలుగా, పోస్టల్ గుమాస్తాలుగా ఎవరికి దొరికిన ఉద్యోగాలను వారు ఆశ్రయించారు. సాంకేతిక నిపుణుల భవిష్యత్తు ఇలా వుంది. ప్రభుత్వం నెలకొల్పిన ఆ కోర్సు చదివిన విద్యార్థులకు ఉద్యోగాలు చూపడం ప్రభుత్వవిధి అయివుంది...కొంతమంది విద్యార్థులు గత రెండుసంవత్సరాల నుంచి ట్రెయినింగ్ అవుతూనే వున్నారు! ఎన్నాళ్లు అలా ట్రయినింగ్ అవాలి?

కొంతకాలానికి కొంతమందికి ఉద్యోగాలు యిచ్చింది ప్రభుత్వం. అవి ఎటువంటివి? బెస్తవాళ్ళకి నూలు పంచే గుమాస్తా ఉద్యోగాలవి. సాంకేతిక నిపుణుల స్థితి చివరకు ఇలా దిగజారింది! ప్రభుత్వము ఉద్యోగాలు చూపించలేకపోతే తక్షణం పాలిటెక్నిక్స్‌లో ఆకోర్సు తీసేయాలి. లేకపోతే యింకా యిలాగే అమాయక విద్యార్థుల, భావిభారత పౌరుల జీవితాలతో చెలగాటం ఆడడం తటస్థిస్తుంది. రెండవది: యిప్పుడున్న సాంకేతికనిపుణులు అందరికి వెంటనే ఉద్యోగాలు యివ్వాలి. వారి జీతాలనుకూడా పెంచాలి. మత్స్యపరిశ్రమ యితర దేశాలతో పోల్చుకుంటే మనదేశంలో ఎంతో అభివృద్ధిపొందవలసివుంది. చేపలు యీనాటి ఆహారకొరతను కొంతవరకు తీరుస్తాయని ఉపన్యాసాలు దంచే వారందరూ ఒక్కసారి ఈ అమాయకవిద్యార్థుల భవిష్యత్తును పరిశీలించమని నామనవి. మూడు: నావిగేషన్ చదువుకొన్నందుకు ప్రభుత్వము వీరిలో కొందరిని విశాఖ పట్టణపు నౌకా కేంద్రములో పనిచేయడానికి సిఫార్సు చేయాలి. ప్రభుత్వము వెంటనే తగు చర్యతీసుకోవాలని కోరుతూ, తీసుకొంటారని ఆశిస్తున్నాను. ★


ఇప్పుడు
దొరుకుతున్నది
మాత్రలరూపంలో

ఒలికిపోయి వృధాకాకుండా వుండడానికి మలభంగా మందు ఉపయోగించుటకు వీలుగా, జమ్మివారి ప్రఖ్యాతమైన లివర్‌క్యూరు ఇప్పుడు మాత్రల రూపంలో దొరుకుతున్నది. మోతాదును మారిస్తూ మాత్రలమీద స్పష్టమైన గీతలున్నాయి. అంచేత తూచినట్టు సరియైన మోతాదు ఇవ్వడంలో ఇప్పుడు మీరు పొరపాటు చెయ్యలేరు



జమ్మివారి
లివర్‌క్యూర్

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్
మైలాపూరు, మద్రాసు - 4.

బ్రాంచి: ఓరుగంటివారి వీధి, విజయనగరం సిటీ.

SISTA'S-J-279


# మతిమరుపు

(5-వ పేజీ తరువాయి)

బావగారి బనీను పైపే వున్నాయి చూపులన్నీ వెంకట్రావుకి. సారథి భార్య యిట్టె గ్రహించుకుంది, "ఆబనీనువాడిది, మీరేసుకెళ్ళారేమండీ" అని నవ్వసాగింది. "నీకేమైనా పిచ్చా? ఇది నేను నిన్న సాయంత్రం కొనుక్కొని రాత్రివంకెకి తగిలించాను. నన్ను దొంగని కడుతున్నారా నా యింట్లో?" అని అన్నంతినే కంచం విసిరి పారేశాడు. వాకిట్లో కొచ్చేటప్పటికి, ప్రక్క వీధి హోటలులో పనిచేసే క్లీనరు ప్రత్యక్షమై, "యిదిగోనండీ బాబుగారూ, మీ బనీను. దీంట్లో మీ పేరుతో రాసిన బిల్లుంది. నిన్నసాయింత్రం మా హోటలులో కాఫీ తాగి మర్చిపోయారక్కడ" అని చేతి కిచ్చాడు. వెనకాతే భార్య యిరవై సొట్టలుపడ్డ వెండికంచం తీసుకొచ్చి చూపించి "మట్టిఅయిందని కడిగాను, కాస్త మీ కొత్తబనీనుతో తుడిచి పెడతారా?" వెటకారంగా అంది.

సారథి మతిమరుపు నివారణార్థం యిప్పటికి ఎటు లేదన్నా యీ యేడాదినుంచీ, వొక వందరూపాయలు ఆయుర్వేద వైద్యులికీ, మరో వందరూపాయలు యింగ్లీషు మందులికీ ఖర్చు పెట్టాడు. కాని యేమాత్రం అభివృద్ధి కనిపించినట్టు తోచదు. మీరేదైనా "సర్వరోగ సంహారి" కని పెట్టి కాస్తంత సాయం చేద్దురూ, మీకు పుణ్యముంటుంది. ★